మాజీ కార్పొరేటర్ దేవానంద్ మృతి



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జె. దేవానంద్(62) కన్ను మూశారు. గత కొంత కాలంగా అస్వస్థతతో బాధపడుతున్న దేవానంద్ ఆరోగ్యం క్షీణించి గురువారం మరణించారు. దేవానంద్ 2009లో బన్సీలాల్‌పేట్ డివిజన్ నుంచి జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించి బన్సీలాల్ పేట్‌లో అనేక ప్రజాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారు. దేవానంద్ మరణంతో బన్సీలాల్‌పేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. దేవానంద్ మరణవార్త తెలియగానే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గద్దర్ కుమార్తె వెన్నెల, బీజేపీ నాయకులు మర్రి పురురవరెడ్డి, ఎ. శ్రీనివాస్ నివాళులర్పించారు. దేవానంద్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ, మాజీ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, టి. మనోజ్‌కుమార్, ఎస్. విఠల్, బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు చిరంజీవి పేర్కొన్నారు.

ఏజీపీగా రాకేష్ కుమార్



లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గం లాలాపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు, హైకోర్టు న్యాయవాది రాకేష్ కుమార్ హింగోలేకర్ తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా (ఏజీపీ) నియమితులయ్యారు. ప్రభుత్వం తరపున వాదనలు వినిపించేందుకు 11 మందిని జీపీలుగా, 44 మందిని ప్రభుత్వ సహాయ న్యాయవాదులుగా నియమిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా రాకేష్‌కుమార్‌కు అవకాశం దక్కింది.



రోడ్డు పక్కనే పార్కింగ్



ఎవరి వాహనాలో.. ఎందుకు నిలిపారో?

రోడ్డుకిరువైపులా అక్రమ పార్కింగ్

- శిథిలమవుతున్నా పట్టించుకోని వైనం
- తొలగించాలంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు, ట్రాఫిక్ పోలీసులు



మరో ప్రాంతంలో నెలల తరబడి ఇలా..

అడ్డగుట్ట: లాలాగూడలోని రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలోని ప్రధాన రోడ్డు పక్కనే నెలల తరబడి కార్లు, ఆటోలు పార్క్ చేసి ఉన్నాయి. ఎవరివో.. ఎందుకు పార్క్ చేశారో తెలియదు. ఎన్నాళ్లు ఉంటాయో అది కూడా తెలియదు. ఈ వాహనాలను పట్టించుకునే నాథులే లేకుండాపోయారు. నెలల తరబడి వాహనాలు అక్కడే నిలిపి ఉంచడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు పక్కనే గుర్తు తెలియని వ్యక్తులు ఇష్టానుసారంగా కార్లు పార్క్ చేసి వెళ్లిపోతుండటంతో రాకపోకలకు ఇబ్బందులతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డుకిరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలను తరలించాలని కోరుతున్నారు.

శిథిలమవుతున్నా తరలించని వైనం..

అడ్డగుట్ట డివిజన్‌లోని లాలాగూడ ప్రధాన రోడ్డు ఇరువైపులా కార్లు, ఇతర వాహనాల పార్కింగ్‌తో నిండిపోయింది. నెలల తరబడి రోడ్డు పక్కనే పార్క్ చేసి ఉన్న కార్లను తొలగించేందుకు ఏ ఒక్కరూ ప్రయత్నించడం లేదు. పూర్తిగా శిథిలావస్థకు చేరిన కార్ల కింద, వాటి చుట్టుపక్కల కొందరు చెత్తా, చెదారాన్ని పారబోసి వెళ్తున్నారు. దీంతో ఆ చెత్త పూర్తిగా రోడ్డుపైకి వస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తలో నుంచి వెలువడుతున్న దుర్గంధంతో స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. వాహనాలు నెలల తరబడి పార్క్ చేసి ఉండడంతో పలువురు స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. అయినా వారు వాహనాలను అక్కడి నుంచి తొలగించడం లేదని, ఎటువంటి స్పందన కూడా లేకుండాపోయిందని స్థానికులు చెప్పుకొస్తున్నారు. లాలాగూడలోని శాంతినగర్ వాటర్ ట్యాంక్ నుంచి బడీ మసీదు వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నెలల తరబడి పార్కింగ్‌లో ఉన్నాయి. మరికొన్ని వాహనాలైతే పూర్తిగా శిథిలమయ్యాయి. మొదట్లో కార్లు రాత్రి సమయాల్లో పార్క్ చేసి ఉదయాన్నే తీసుకెళ్లేవారు. ఆ తర్వాత కొన్ని కార్లు నెలల తరబడి రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి వెళ్లిపోయారు.

వారాంతపు సంత రోజు నరకమే..

శాంతినగర్‌లోని వాటర్ ట్యాంక్ నుంచి లాలాగూడ బడీ మసీదు వరకు ప్రతీ గురువారం కూరగాయల మార్కెట్ జరుగుతుంది. ఆ సమయాల్లో రోడ్డుపై తీవ్ర ట్రాఫిక్ ఏర్పడుతుంది. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు లాలాగూడ మీదుగా వెళ్లాలంటే వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. పార్క్ చేసిన వాహనాలు ఉండడం కారణంగా ప్రధాన రోడ్డుపైన మార్కెట్ నిర్వహించాల్సి వస్తుంది. దీంతో పలు సమయాల్లో కూరగాయల కొనుగోలుదారులకు ప్రమాదవశాత్తు వాహనాలు ఢీ కొని ప్రమాదాలకు గురవుతున్నారు. అందువల్ల రోడ్డుపై నెలల తరబడి పార్కింగ్‌లో ఉన్న వాహనాలను తొలగిస్తే గురువారం మార్కెట్ సమయాల్లో అటు మార్కెట్ నిర్వాహకులకు ఇటు కొనుగోలుదారులతో పాటు ప్రయాణికులకు కూడా ఇబ్బంది లేకుండా ఉంటుంది. వాహనాలను తొలగించి ఆ స్థలంలో మార్కెట్ నిర్వహిస్తే సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

హెల్మెట్ ప్రాణాలు కాపాడే ఆయుధం



హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో డీసీపీ, ఏసీపీ

రసూల్‌పురా: కొంత మంది అతివేగం, రాంగ్ రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలపై మీదకు తెచ్చుకుంటున్నారని నగర ట్రాఫిక్ డీసీపీ ఎల్. సుబ్బారాయుడు పేర్కొన్నారు. నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పీజీ కళాశాల ఆడిటోరియంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, వారి పిల్లలకు గురువారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ..ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ మీ ప్రాణాలు కాపాడే ఆయుధమని సెల్‌ఫోన్ పగలకుండా స్క్రీన్ గార్డు, పౌచ్‌లు వేయిస్తామని కాని వాహనాలు నడిపేటప్పుడు మాత్రం హెల్మెట్ ధరించరని సెల్‌ఫోన్‌కు ఉన్న విలువ కూడా తలకు లేదా అని ప్రశ్నించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. రవికుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మృదుల, ట్రాఫిక్ అదనపు డీసీపీ ఎస్, రంగారావు, బోయిన్ పల్లి, మారేడుపల్లి, బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, టీటీఐ బేగంపేట ఇన్‌స్పెక్టర్ వి. రాంచందర్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం భవనంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మధుకర్ నాయక్

రసూల్‌పురా: కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్‌వీఎం హాస్పిటల్ (లక్ష్మక్కపల్లి) సహకారంతో మూడవ వార్డు అన్నానగర్ ముదిరాజ్ సంఘం భవనంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని బోర్డు సీఈవో మధుకర్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పిట్ల నాగేష్ మాట్లాడుతూ.. నగర తొలి మేయర్ దివంగత కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ పేరిట సేవా సమితి ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, కనకయ్య, వైద్యులు అపూర్వ, మురళి, కళ్యాణ్, తేజస్విని, పుష్పనీల్, హరీష్, స్థానిక నేతలు కనకయ్య, యాదగిరి, శ్రీనివాస్, వేణుగోపాల్, శ్రీను, రాజు, శ్యామ్, క్రిష్ణ పాల్గొన్నారు.

అరుదైన వ్యాధులపై విస్తృత పరిశోధనలు జరగాలి



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌వీ కర్ణన్

సనత్‌నగర్: అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారి ఆరోగ్య సంరక్షణలో భాగంగా సామాజిక అంశాలు, రోగ నిర్ధారణ, చికిత్స అందించడం తదితర ప్రక్రియలపై విస్తృతంగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. అరుదైన వ్యాధుల దినోత్సవం సందర్భంగా అమీర్‌పేటలోని సెస్ ఆవరణలోని జెనిటిక్స్ ఇనిస్టిట్యూట్, జెనిటిక్స్ ఆస్పత్రిలో గురువారం అన్‌రేవిల్లింగ్ ది జెనెటిక్ మిస్టరీస్–ఫోకస్ ఆన్ కేరింగ్ ఫర్ ది రేర్ డిసీజెస్' అంశంపై సదస్సు నిర్వహించారు. జెనిటిక్స్ ఇనిస్టిట్యూట్, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మీ, హెచ్‌ఓడీ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన కర్ణన్ మాట్లాడుతూ.. అరుదైన వ్యాధులను కట్టడి చేయడం, బాధితులను గుర్తించి చికిత్స అందించడం చాలా అవసరమన్నారు. ప్రతియేటా అరుదైన వ్యాధుల దినోత్సవాన్ని నిర్వహిస్తుండటం, ఈ క్రమంలో పలు జాతీయ స్థాయి సంస్థలతో మమేకమై అవగాహన కల్పించేలా ముందుకుసాగడం పట్ల జెనిటిక్స్ ఇనిస్టిట్యూట్, జెనిటిక్స్ ఆస్పత్రి ప్రతినిధులను అభినందించారు.

అరుదైన వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న చిన్నారుల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. బాధితులకు అరుదైన వ్యాధులు పునరావృతం కాకుండా నిరోధించడానికి క్యారియర్ స్క్రీనింగ్, జెనిటిక్ కౌన్సెలింగ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సదస్సులో జెనిటిక్స్ ఇనిస్టిట్యూట్, జెనిటిక్స్ ఆస్పత్రి ఫెటల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ ఉషా దత్త, డాక్టర్ ఎం.రవితేజ, నదీర్ అమన్, ప్రొఫెసర్ సూర్యప్రభ తదితరులు హాజరై అరుదైన వ్యాధులు, వాటి వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు, నివారణ మార్గాలు తదితర అంశాలపై మాట్లాడారు. అంతకు ముందు అరుదైన వ్యాధులపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గోపాలపురం ఇన్‌స్పెక్టర్‌గా శ్రీకాంత్‌రెడ్డి



రాంగోపాల్‌పేట్: గోపాలపురం ఇన్‌స్పెక్టర్‌గా శ్రీకాంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న నర్సింగ్‌రావు ఎన్నికల కోడ్ నేపథ్యంలో చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా మల్టీజోన్–2లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడతానన్నారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావును సత్కరించి వీడ్కోలు పలికారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



అమీర్‌పేట: జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్‌నగర్ శ్రీచైతన్య స్కూల్లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు వివిధ నమూనాలు తయారు చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.కె.ఎస్.సుధా మాట్లాడుతూ.. చిన్నారుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, అనిత, శివరామకృష్ణ,మురళీ కృష్ణ పాల్గొన్నారు.

బాలిక నగ్న చిత్రాలతో బ్లాక్ మెయిలింగ్

యువకుడికి మూడేళ్ల జైలు



సనత్‌నగర్: ప్రేమ పేరుతో బాలికను నమ్మించి ఆమె నగ్న చిత్రాలు, వీడియోలను సేకరించి వేధింపులకు పాల్పడిన ఓ యువకుడికి మూడేళ్ల జైలు శిక్ష విధించిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామయ్య వివరాల ప్రకారం.. ప్రైవేటు ఉద్యోగం చేసే ఓ వ్యక్తి తన భార్య, కుమార్తెతో శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతంలో నివాసముంటున్నాడు. 2021 నవంబర్ 9న విజయవాడలో ఉండగా ఫోన్‌కు తన కుమార్తె (మైనర్) నగ్నంగా ఉన్న ఫొటోలు, వీడియోలు వచ్చాయి. మెదక్ జిల్లా అల్లాదర్గ్ గౌతపూర్‌కు చెందిన సురేష్ (21) అనే యువకుడు వాటిని పంపించినట్లు గుర్తించాడు. నగ్న ఫొటోలు, వీడియోలను పంపించి డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో పోలీసులను ఆశ్రయించాడు. తన కుమార్తెను ప్రేమ పేరుతో పరిచయం చేసుకున్నాడని, తద్వారా తన కుమార్తె నగ్నంగా ఉన్న ఫొటోలు, వీడియోలను సేకరించి బ్లాక్ మెయిలింగ్ చేస్తున్నాడని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి అన్ని ఆధారాలతో నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా నాంపల్లి 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి అనిత, సురేష్‌కు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

క్రైం కార్నర్..

పిల్లల కిడ్నాప్ అంటూ అనుమానంతో దేహశుద్ధి

మణికొండ: పాఠశాలకు వెళ్తున్న ముగ్గురు బాలికలను కిడ్నాప్ చేసేందుకు యత్నించాడనే కారణంతో ఓ వ్యక్తికి దేహశుద్ధి చేసి నార్సింగి పోలీసులకు అప్పగించిన ఘటన హైదర్‌షాకోట్‌లో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదర్‌షాకోట్‌లో నివాసముంటున్న 3–5 తరగతి చదువుకుంటున్న బాలికలు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్నారు. గురువారం వారి వద్దకు వచ్చిన ఓ వ్యక్తి వారిని పాఠశాలకు కాకుండా మరో దారిలో తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా బాలికలు ఏడుస్తుండటంతో అటుగా వెళ్లేవారు చితకబాదారు. అతను బాలికలను కిడ్నాప్ చేసేందుకు యత్నించాడా.. ఇంతకు ముందు ఎక్కడైనా ఇలాంటి నేరాలకు పాల్పడ్డాడా.. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. బాలికల కిడ్నాప్ విషయంలో నిజం లేదని, అనుమానంతో స్థానికులు దేహశుద్ధి చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హైదర్షాకోట్ కపిలనగర్ హనుమాన్ టెంపుల్ ప్రాంతానికి చెందిన వెక్కి శ్రీను (45) గత నెల 28న రోడ్డుపై వెళ్తుండగా ద్విచక్ర వాహనం (టీఎస్07 కేఎఫ్ 8145)పై వచ్చిన ఓ వ్యక్తి శ్రీనును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

చట్టంముందు అందరూ సమానులే



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శంకర్

కంటోన్మెంట్: భారత రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు అందరూ సమానమేనని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. మారేడుపల్లి తహసీల్దారు కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం సంజీవయ్య నగర్ కమ్యూనిటీ హాల్లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న శంకర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. దళితుల పట్ల కులం పేరుతో వివక్షత పాటించడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా పిల్లల చదువులు మధ్యలో ఆగకుండా చూడాలన్నారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి అంబేద్కర్ విద్యానిధి పథకం కింద రూ.20 లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మారేడుపల్లి ఆర్.ఐ సర్వేష్, వార్డెన్ జలాలుద్దీన్, బస్తీ నాయకులు పెద్దాల నర్సింహ పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'షీ–టాక్స్'



సదస్సులో పాల్గొన్న వక్తలు

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం–పరల్స్ లిటరరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'షీ–టాక్స్' కార్యక్రమం ఆలోచింపజేసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కే పద్మావతి ప్రేరణతో జరిగిన షీ–టాక్స్ వేదికపై కళాశాలలో వివిధ విభాగాలకు చెందిన దాదాపు 25 మంది విద్యార్థులు వారి జీవితంలో జరిగిన ఘటనలను ఆవిష్కరించి తోటి విద్యార్థుల్లో స్ఫూర్తిని రగిల్చి ఆలోచింపజేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భవితవ్యాన్ని దిశానిర్దేశం చేయడంలో ఉపకరిస్తాయన్నారు. అలాగే నిర్దిష్ట లక్ష్యం వైపు పయనించేందుకు బాధ్యతను గుర్తుచేస్తాయన్నారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ నాన్సి సరీనా మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా మలిచేలా షీ–టాక్స్ లాంటి కార్యక్రమాల నిర్వహణ అవసరమని అభిప్రాయపడ్డారు. పీజీ కళాశాల ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ మృదుల లక్కరాజు 'ఎక్స్‌ప్లోరేషన్ అండ్ ప్రజంటేషన్' అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో పరల్స్ లిటరరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ నిఖిల పాల్గొన్నారు.

పైలాన్ ఆవిష్కరణకు సీఎంను ఆహ్వానించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సెంటినరీ పైలాన్ ఆవిష్కరణకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత నేతలు పీవీ నర్సింహరావు, జైపాల్ రెడ్డి పేరుమీద పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పరీక్ష ప్రాణాలు కాపాడింది!





అగ్నిప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్, మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

- కూతురిని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లిన కాసేపటిలోనే ఇంట్లో అగ్నిప్రమాదం

లాలాపేట: ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తార్నాక స్ట్రీట్ నెంబర్–1 కిమ్తి కాలనీలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు స్మితా–కోటేశ్వర్‌గౌడ్ దంపతులు అద్దెకు ఉంటున్నారు. ఇంటర్ చదువుతున్న తన కూతురిని గురువారం పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. వారు వెళ్లిన కాసేపటికే ఇంట్లో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు చూసిన సమీప గృహాల వారు భయాభ్రాంతులకు గురయ్యారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న డిప్యూటీ మేయర్ మోతే శోభన్ రెడ్డి గమనించి ఫైర్ సిబ్బందికి వెంటనే సమాచారం అందించారు. వారు వచ్చేలోపే ఇంట్లోని ఫర్నిచర్, ఇతర సామగ్రి కాలి బూడిదయింది. ఫైర్ సిబ్బంది మంటలను వ్యాపించకుండా ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేని కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విద్యుదాఘాతంతోనే ఈ అగ్నిప్రమాదం సంభవించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇంట్లో దాచుకున్న డబ్బులు, నగలు, బట్టలు అన్నీ కాలిపోయాయని బాధితులు డిప్యూటీ మేయర్ ముందు బోరున విలపించారు. ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని డిప్యూటీ మేయర్ భరోసా ఇచ్చారు.

అభినందనలు

అమీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఏఐసీసీ కార్యదర్శి డా.జి.చిన్నారెడ్డిని కాంగ్రెస్ నేతలు కమ్మగోని చౌదరిగౌడ్, నర్సింగరావు, యూనిస్ గురువారం ప్రజాభవన్‌లో కలిసి అభినందనలు తెలిపారు.

టీఎస్‌పీ నూతన కార్యవర్గం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ స్టూడెంట్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర, ఓయూ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.అధ్యక్షుడిగా బారి అశోక్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా వడ్డె గణేష్, ఉపాధ్యక్షుడిగా బాలగాని సైదులు, అధికార ప్రతిధిగా వెంపటి సురేష్, గ్రేటర్ అధ్యక్షుడిగా వెంపటి భగత్ సింగ్, కార్యదర్శిగా వడ్డేపల్లి సందీప్, కోశాధికారిగా దండేపల్లి నవీన్ ఎంపికయ్యారు. ఓయూ ఇన్‌చార్జిగా నూకల మధుయాదవ్, కార్యదర్శిగా కేలోత్ కిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బొంతుల రాజ్‌కుమార్, ఏర్పుల మహేషలను ప్రకటించారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని మాస్టర్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం గురువారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఉత్సాహంగా సాగింది. సాంప్రదాయ నృత్యాలతో పాటు వెస్టన్, ఫోక్, సోలో డ్యాన్సులతో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ రాజు సంఘాని మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు, సంస్కృతి, సాంప్రదాయాలను కూడా బోధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రంజిత్‌కుమార్, విజయ్ సారథి, జగన్నాథం, యాదగిరి, లావాణ్య, గీత, ఖాజా పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్మన్

ప్రొ.గణేష్‌కు వీడ్కోలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సోషియాలజీ అధ్యాపకులు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గణేష్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం పొ.గణేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ 133వ తరగతి గదిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు ప్రొ.గణేష్‌ను ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఇదిలా ఉండగా ఆర్ట్స్ కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపల్‌గా ప్రొ.అర్జున్‌రావు బాధ్యతలు స్వీకరించారు.